


యర్రంశెట్టి సాయి

"పళ్ళు రాలగొడతాను! ఇంకా చిన్న పిల్లవే గదాని, ఇష్టమొచ్చినట్లు తిరగ నిస్తోంటే ఇదా నువ్ చేసే ఘనకార్యం?"

ఆమె రౌద్రానికి సీత కళ్ళవెంబడి నీళ్ళు తిరిగినయ్! రెండు చేతుల్తోనూ మొఖం కప్పుకొని బిగ్గరగా ఏడ్వేయ సాగింది.

"నీలాంటి పాడుబుద్ధులున్నదానిని స్కూలుకి పంపటం కూడా అనవసరం! ఇవాళ్ళినుంచి స్కూలు మానేసి ఇంట్లో పడుండు..."

సీత విలపిస్తూ అక్కడే కూలబడి పోయింది.

గదిలోకెళ్ళి మంచంమీదకు వరిగి పోయింది ప్రసూనాంబ.

ఆమె మనసంతా పూర్తిగా పాడయి పోయింది.

గుండెలింకా వేగంగా కొట్టుకోవడం తగ్గలేదు. హఠాత్తుగా రమణ గుర్తుకొచ్చాడామెకి ఒళ్ళంతా జలదరించినట్లయింది,

"జామకాయలు కావాలా?" రమణ అడిగాడు.

"ఎక్కడివి?"

"నీకెందుకు? నాతో, రా!"

వెర్రిగా అతనివెంబడి పరిగెత్తింది తను.

దాసుగారి తోటలో తనను బయట నుంచోబెట్టి అతను గోడెక్కి జామ కాయలు కోయసాగాడు. నాలుగయిదు కాయలు కోసేసరికల్లా తోటలో ఎవరివో కేకలు వినిపించినయ్! తను పరుగుతో ఇంటిదగ్గరకొచ్చి పడింది. తర్వాతే మయిందో తనకు తెలీదు. నాలుగు రోజుల్తరువాత మళ్ళీ కనిపించాడు రమణ. 'ఏమయ్యాడో', తోటమాలి బాగా కొట్టాడేమోఅని తనకి ఆత్రుతగానే ఉంది. ఆ నాలుగురోజులూ స్కూల్లో కూడా కనిపించలేదు ఆ రోజు. ఇంటర్వెల్లో తను స్కూల్ ఆవరణబయట ఉన్న

"నేనూ ఆ అబ్బాయీ ప్రేమించు కొన్నాం..." తలొంచుకొని నెమ్మదిగా అంది సీత.

ప్రసూనాంబ కొద్ది క్షణాలపాటు స్తంభించిపోయింది. కూతురి నడవడి గురించి కొంత అనుమానం కలిగించినా, అది వట్టి అనుమానంగానే మిగిలిపోతే బావుండునని వెయ్యిదేముళ్ళకు మొక్కు కొంటూ వచ్చింది. ఏదయితే జరక్కూడ దనుకుంటుందో అదే జరుగుతోంది.

గోడనానుకొని నిలబడ్డ కూతురివంక చూసిందామె.

పదహారో సంవత్సరం అప్పుడే వచ్చిందామెకి. పాలబుగ్గలు, కాటుకకళ్లూ, బాల్యం తాలూకు చిహ్నాలు ఇంకా పూర్తిగా పోనేలేదు. ఇంకా లంగా, జాకెట్టూ, గౌన్లతో తిరిగే అవతారమే కళ్ళముందు మెదుల్తోంది. దీనికప్పుడే ప్రేమా?

విపరీతమైన కోపం వచ్చింది ప్రసూనాంబకి. ఆ పిల్ల చెంపమీద ఈడ్చి ఒకటి పెడదామనికూడా అనిపించింది. కాని ఎంతో కష్టంమీద నిగ్రహించుకొంది. విసురుగా కూతురిచేయి పట్టుకొని దగ్గరకు లాగింది. తూలిపడబోయి తల్లిని పట్టు కొని నిలబడిపోయింది సీత. గాభరా గానూ, భయంతోనూ తల్లి మొహంలోకి చూసింది.



పుస్తకాల షాపుకెళ్ళి నోట్ పుస్తకం కొనుక్కొస్తూంటే ఎదురుపడ్డాడు.

"ఏయ్ రమణా!" ఆదుర్దాగా పిలిచింది తను.

"ఏమిటి?"

"ఆ రోజేమయింది? ఎక్కడకు పోయావిన్నాళ్లూనూ?"

గట్టిగా నవ్వాడు రమణ

"ఎక్కడికేముంది, నీ తలకాయ! తోటమాలి నన్ను పట్టుకుపోయి మా అమ్మకు రిపోర్ట్‌చేశాడు. మా అమ్మేమో గదిలోపడేసి తలువులు మూసేసి నాన్న రానీ నీ సంగతి చెప్తానంది దాంతో నా క్కొంచెం భయంవేసింది. నాన్నతో చెప్తే నాన్న బొమికలిరిగేట్లు కొడతారు. అంచేత మధ్యాహ్నం మా అమ్మ తలుపు తీయగానే బయటకు పరుగెత్తాను. సరాసరి వెళ్ళి రైలెక్కేశాను..."

"ఎక్కడికి?" ఆశ్చర్యంగా అడిగింది తను.

"ఎక్కడికేమిటి? వల్లూరు! మా తాతయ్య వాళ్ళింటికెళ్ళి నాలుగురోజులూ దర్జాగా, హాయిగా ఉన్నాను.

చివరకు నిన్న మా నాన్న వచ్చి బ్రతిమాలి తీసుకొచ్చాడు..."

బెల్ అవడం మూలాన పరుగుతో స్కూల్‌కి వెళ్ళిపోయింది తను.

తరువాత కొద్దిరోజులకే వేసవికాలం సెలవులొచ్చేసినయ్! సెలవుల్లో రమణ బెజవాడ వెళ్ళివచ్చాడు. అక్కడ వాళ్ల పిన్నివాళ్లున్నారట. వచ్చిన తరువాత బెజవాడ టౌన్ సంగతీ, అక్కడి సినిమాల సంగతి చెప్తోంటే తనకు ఎంతో సరదాగా ఉండేది వినడానికి. మరో సంవత్సరంకూడా గడిచిపోయింది. రమణలో రాను రాను చాలా మార్పులు వచ్చినయ్. ఒక్కడే కొడుకవడంవల్ల అతని తల్లిదండ్రులు అతనేమడిగితే అది కొనివ్వడం జరుగుతూండేది. ఎప్పుడూ ఖరీదయిన దుస్తులూ, కొత్త ఫాషన్లూ—అన్నీ తమస్కూల్‌లో రమణే ప్రారంభం చేసేవాడు.

ప్రక్క ఊళ్ళో సర్కస్ వచ్చిందో సారి. అమ్మా, నాన్నా, తనూ బయల్దేరారు ఎడ్లబండిలో సర్కస్‌కి. అన్నయ్య అప్పటికే పట్నంలోని కాలేజీలో చేరిపోయాడు.

సర్కస్‌లో తమముందే కూర్చుని కన్పించాడు రమణ.

"ఒక్కడివే వచ్చావా?'' అడిగింది అమ్మ.

"అవునండీ!" అన్నాడు రమణ తన వంక చూసి నవ్వుతూ!

తనకు బోలెడు సంతోషం కలిగింది. తిరిగి వెళ్ళేప్పుడు, సరదాగా రమణతో కబుర్లు చెప్తూ వెళ్లొచ్చని! సర్కస్ వదిలేసరికి పదిదాటింది. బండికట్టుకొని ఇంటికి బయల్దేరారందరూ. మంచి వెన్నెల! ఇసుకరోడ్డుమీద బండి వెనుకనే నడుస్తున్నాడు రమణ.

"నేనూ నడుస్తానమ్మా!" అంది తను.

తల్లి వప్పుకొంది.

ఇద్దరూ బండికంటె ముందుగా కబుర్లు చెప్పుకొంటూ నడువసాగారు.

తమ ఊరి పొలిమేరల్లో కొచ్చేసరికి బండి చాలా వెనకబడిపోయింది. తంగేడు గుబుర్లనీడల మధ్యగా నడుస్తున్నారు.

"ఓ నిముషం ఆగు..." అన్నాడు రమణ.

"ఏమిటి?'' ఆగిపోయి అడిగింది తను.

"దగ్గరకు రా..."

తను దగ్గరకు వెళ్ళింది.

ఛటుక్కున కౌగలించుకొని పెదాల మీద ముద్దుపెట్టుకొన్నాడు రమణ. వళ్ళంతా కాగిపోతున్నట్లనిపించింది తనకి. శరీరంలో ఏదో జరుగుతోంది కాని ఏం జరుగుతుందో తెలీటంలేదు.

"ఛీ! ఏమిటిది?" అంది తను దూరంగా జరుగుతూ.

"ముద్దు! మా తాతయ్యగారింటి దగ్గరున్నప్పుడు ఓ అమ్మాయి నేర్పించింది!

ఇంకా చాలా ఉందిలేగాని, అదంతా తర్వాత చెప్తాను..."

మళ్ళీ ఓసారి తనకేసి గట్టిగా అదుముకొని ముద్దుపెట్టుకొన్నాడతను. సిగరెట్ వాసన గుప్పుమంది. ఈలోగా దగ్గరగానే బండి వస్తున్న చప్పుడవడంతో మళ్ళీ ఇద్దరూ నడక సాగించారు.

మరో రెండు మూడు నెలలవరకూ అతని జాడ తెలీలేదు తనకి. అతన్ని కలుసుకోవాలని ఎంతో ప్రయత్నించింది తను. అతనంటే ఓ విధమయిన ఇష్టం కలిగింది తనలో. ఆ రోజు ముద్దుపెట్టుకొన్న తరువాత తనకు తెలీకుండానే అలాంటి అనుభవం తిరిగి కోరుకో సాగింది తను.

రిజల్ట్సు వచ్చినయ్! తను పాసయింది. రమణ తప్పాడు. ఆ సంవత్సరం నుంచే తను లంగా ఓణీలు వేయాల్సొచ్చింది! రమణ మళ్ళీ స్కూల్లో చేరలేదు.

ఓ ఆదివారం హఠాత్తుగా మధ్యాహ్నం పూట ఇంటికొచ్చాడు. ఆ సమయానికి తన తల్లి ఇంట్లోలేదు. ఎవరింటికో వెళ్ళింది. ఇంట్లో తనొక్కర్తే ఉంది!

"ప్రసూనా! ఇదిగో ఈ ఉత్తరం ఎవ్వరూ లేకుండా చూసి చదువుకొని రేపు స్కూల్ కెళ్ళేటప్పుడు జవాబురాసి నాకివ్వు! నేను స్కూల్ దగ్గర కలుసుకొంటాను..." అనేసి మరోసారి కౌగలించుకొని ముద్దుపెట్టుకొని పరుగెత్తుకొంటూ వెళ్లిపోయాడు.



ఆ ఉత్తరం భావం తన కప్పటికే అర్థమయింది.

మూడు నాలుగేళ్ళనుంచీ ఆ ఊరి దగ్గరగా వెలసిన టూరింగ్ టాకీస్ సినిమాలు ఆ పరిజ్ఞానాన్ని తనకు కలిగించినయ్!

"ప్రసూనా,

నీ అందం చూస్తూంటే నాకు పిచ్చెక్కిపోతోంది. మనిద్దరం ఏవేవో మాట్లాడుకోవాలనీ, ఎన్నెన్నో అనుభవించాలనీ అనిపిస్తోంది! ఎప్పుడు, ఎక్కడ కలుసుకోవాలో నువ్వే దారి చెప్పాలి! వెంటనే జవాబు రాసి రేపు స్కూల్ కి తీసుకురా! నేను అక్కడ కలుసుకొంటాను.

నీ ప్రియమైన రమణ..."

ఒళ్ళంతా పులకరించినట్లయింది తనకి. తనూ రమణని ప్రేమించినట్లనిపించసాగింది. అతని కౌగిలీ—అతని ముద్దూ—ఇంకా అతను నేర్పబోతున్న కొత్త అనుభవాలూ అన్నీ ఎంత త్వరగా చవిచూస్తామా అన్న తహ తహ పెరిగిపోయింది. తనకి రమణ కావాలి! రమణకి తను కావాలి! ఇద్దరూ ఒకరిని విడిచి ఒకరు ఉండలేరు. ఇద్దరి మధ్యా అంత గాఢమైన ప్రేమ ఉంది. జవాబు రాసింది ప్రసూనాంబ. కాని ఎక్కడ ఎలా ఒంటరిగా కలుసుకోవాలో ఆమెకి తెలీలేదు. అతనినే సలహా అడిగింది. మర్నాడు ఆ ఉత్తరం అతని కందించటం తనకేమీ కష్టంకాలేదు. ఎలా కలుసుకోవాలో, ఎప్పుడు కలుసుకోవాలో అనేక ఉపాయాలు సూచిస్తూ ఉత్తరాలు రాశా

దతను. కానీ ఏదీ ఆచరించడానికి వీల్లేక పోయింది. ఎప్పుడూ ఏదో ఒక అడ్డు! ఉత్తరాల్తోనే చాలా రోజులు గడిచిపోయినయ్. ఒకటి రెండుసార్లు కలుసుకొన్నారుగానీ ఎంతో సేపు గడపటానికి వీల్లేకపోయింది.

రమణదీ తనదీ ఓ కులం కాదు! అతనికి చదువులేదు! వ్యవసాయంకూడా చెయ్యడు. అందుచేత ఎవ్వరూ తమ వివాహానికి ఒప్పుకోరు. తనకు తెలుసది. అయితే అందుక్కూడా రమణ ఓ ఉపాయం చెప్పేడు. ఇద్దరూ చేతికందినంత డబ్బుతో ఊరొదిలి పారిపోవడం. తరువాత అతనేదేనా ఉద్యోగం సంపాదించడం-హాయిగా బ్రతికేయడం!

ఆ ఉత్తరమే తన తల్లిచేతిలో పడింది పొరపాటున. అంతే! మర్నాడే అన్నయ్య వచ్చి ఇంట్లో వాలాడు. తనని యస్సెల్సి మధ్యలో మానిపించేశారు. గడపదాటనీకుండా గట్టిగా కాపలా పెట్టారు. రమణ జాడే తెలీకుండా జాగ్రత్తపడ్డారందరూ. నాలుగయిదురోజులగ్గానీ తను మామూలు మనిషి కాలేకపోయింది. ఓరోజు రాత్రి అన్నయ్య తనని పిలిచి దగ్గర కూర్చోబెట్టుకున్నాడు.

"చూడు ప్రసూ! నేను నీస్నేహితుడి ననుకొని చెప్పు! నువ్వు రమణని ఎందుకు పెళ్లిచేసుకోవాలనుకొన్నావ్?"

''ఇద్దరం ప్రేమించుకొన్నా మన్నయ్యా!"

"అంటే?''

"ఏమి టంటే?"

"ప్రేమంటే ఏమిటి?"

తనకేం జవాబివ్వాలో తెలీలేదు. ఎంత ఆలోచించినా తట్టలేదు కూడా!

"మాట్లాడవేం ప్రసూ!''

"ప్రేమంటే చెప్పటం ఎలా? మనసులో అనిపించేదది..."

"ఏమనిపిస్తుంది?"

దీనికి తనేమీ జవాబు చెప్పలేక పోయింది...

"రమణా నువ్వూ ఇద్దరూ ఒంటరిగా ఒకేచోట ఉండి కౌగలించుకోవాలనీ— వగయిరా వగయిరా...అంతేనా?"

సిగ్గుతో తలవంచుకొంది తను.

"జవాబు చెప్పాలి! సిగ్గుపడకూడదు! ముందే చెప్పాను కదా! నేనిప్పుడు నీ అన్నయ్యను కాదు! నీ స్నేహితురాలిని!..."

అవునన్నట్లు తలూపింది తను.

''ఇంకా నువ్ చూసిన సినిమాలలో లాగా—ఇంట్లో ఎదిరించి పెళ్ళిచేసుకోవడం' పెళ్లయిన తరువాత కొంచెం కష్టాలూ—తరువాత కలకాలం సుఖం- ఇవేగా నీ మనసులో కలిగిన భావాలూ ..."

"అవును..." అంది తను కొంచెం ఆశ్చర్యంగా.

''దీనిని ప్రేమ అనరు ప్రసూ! ప్రేమించే వయససలు ఇదికాదు! ఈ వయసులో మనం అనుకొనేది ప్రేమ కాదు! డిజైర్! అంటే కోరిక! వాంఛ తెల్సిందా! ఈ వయసు కేవలం యవ్వనపు అనుభవాలు కోరుతుంది అంతే! రమణే కాదు! మరే కుర్రాడినయినా నువ్ వాంఛించవచ్చు! కాని ప్రేమ అలా కాదు. మరో మనిషిని సుఖపెట్టాలనుకోవడం—అతను సుఖంగా ఉండాలని కోరుకోవడం! అంతగా ఆలోచించే పరిజ్ఞానం ఈ వయసులో ఎవరికీ ఉండదు. ఇదంతా సినిమా ప్రేమ. సరే! అదలా వదిలెయ్!

రమణ సంగతి ఆలోచిద్దాం! వాడిని నువ్ పెళ్ళాడ్డానికి కావలసిన అర్హతలు వాడికేమీ లేవు! నీలాంటి అమ్మాయిలకి ఇద్దరకు ఇలా ఉత్తరాలు రాశాడు. నీకు తెలీదేమో! వాడికి తాగుడు కూడా అలవాటయిందని తెలిసింది. అలాంటి వాడిని చేసుకొని జీవితమంతా దుఃఖమయం చేసుకుంటావా?"

తనేమీ జవాబివ్వలేకపోయింది. రమణ అంటే ప్రేమ పూర్తిగా తుడిచి పెట్టుకుపోకపోయినా, అతనంటే కొంత వరకూ ఆకర్షణ తగ్గింది ఆ మాటల్తో.

ఆ యేడు తనూ పట్నం వెళ్ళింది అన్నయ్యతో. అక్కడే చదువు పూర్తి చేసింది. అన్నయ్య విలువయిన మాటల అర్థం బి.ఏ. చదువుతోండగా తన కర్థమయింది. తర్వాత ఆయనతో ప్రేమ వివాహమయింది. ఈ ప్రేమలో పరిపూర్ణత ఉంటుంది. రమణ సంగతులు చాలా రోజులవరకూ తనకు తెలుస్తూనే ఉన్నయ్. తన స్నేహితురాలు నీరజనే అతను పెళ్ళాడడం — కొద్దిరోజుల్తరువాత—నీరజే అతనిని వదిలేయటం— ఇద్దరిమధ్యా కొట్లాటలూ — కోర్టులో దావాలూ—

ఓసారి తను ఊరు వెళ్ళినప్పుడు నీరజే కనబడి చెప్పింది. విపరీతమయిన తాగుడికి బానిస అయిపోయి ఆస్తంతా అమ్ముతూంటే తను చూస్తూ సహించలేకపోయిందట! అలాంటి వాడితో కనిసి ఉండటంకంటె విడిపోవటం మంచిదని నిర్ణయించుకొందిట ... తనకప్పుడు అనిపించింది, అన్నయ్య దేముడిలా తన జీవితం కాపాడాడని!

అలా చక్కగా నచ్చజెప్పటం ఎంత మందికి సాధ్యమవుతుం దీరోజుల్లో! ఇప్పుడు తన కూతురు సీతకి అలా చెప్పి ఒప్పించగలదా తను! ఊహూ! తనకు నమ్మకంలేదు! అన్నయ్యే రావాలి! వచ్చి సీతకు నచ్చజెప్పాలి! వాడిలా మనసుకి నచ్చేట్లు ఎవరూ చెప్పలేరు! ఒకో మనిషికి భగవంతుడిచ్చే విద్య అది. కాగితం కలం తీసుకొంది ప్రసూనాంబ.

"అన్నయ్యా..."

చరిత్ర మళ్ళీ మొదలయింది. అంతమెలా అవుతుందో తెలీదు..."